క్లుప్తంగా

ముమ్మరంగా ఆస్తి పన్ను వసూలు



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూలు ముమ్మరంగా కొనసాగుతుంది. బకాయిలు చెల్లించాలని, మున్సిపల్ అధికారులు ఇచ్చిన రెడ్ నోటీసులు జారీ చేయడంతో పాటు ఆస్తులు సీజ్ చేస్తుండడంతో బకాయిదారులు పన్నులు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో సోమవారం ఒక్కరోజే రూ.44.79లక్షల ఆస్తి పన్ను వసూలైనట్లు మున్సిపల్ కమిషన్ తెలిపారు. బకాయిదారులు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఒక్కరోజే వారి వెంట ఆర్ఐలు సాంబయ్య, సాజీ లతో పాటు వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



పతకం అందుకుంటున్న కార్తీక్ రెడ్డి

నిడమనూరు : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నిడమనూరు మండలం, నారమ్మగూడెం గ్రామానికి చెందిన బైరెడ్డి కార్తీక్ రెడ్డి జావెలిన్ త్రోలో రజత పతకం సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కార్తీక్ రెడ్డి ప్రతిభచూపి జావెలిన్ త్రోలో 41.6 మీటర్లు(అండర్-16) విసిరి రజత పతకం సాధించారు. హైదరాబాద్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కార్తీక్ రెడ్డి చిన్ననాటి నుంచి క్రీడలతో ఆసక్తి కనబరుస్తుండటంతో తల్లిదండ్రులు బైరెడ్డి సత్యనారయణ రెడ్డి -సంధ్యాలు ప్రోత్సహించడంతో పతకం సాధించినట్లు కార్తీకరెడ్డి తెలిపారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్

మిర్యాలగూడ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 'చలో హైదరాబాద్' వెళ్తున్న దామరచర్ల మండల ఆశా కార్యకర్తలను, సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్‌ను వాడపల్లి పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, ఆశా కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

ఊరికి వెళ్లొస్తూ.. మార్గమధ్యలో వ్యక్తి మృతి

నిడమనూరు : భూమి కొనుగోలు కోసం వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన నిడమనూరులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడలోని సీతారాంపురంలో నివాసం ఉంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి షేక్ సలాం(50) నిడమనూరు మండలంలోని నందికొండవారిగూడెం శివారులో ఆదివారం సాయంత్రం ఓ తోటను పరిశీలించాడు. అనంతరం తిరిగి వెళ్తుండగా అస్వస్థతకు గురికావడంతో సలాం స్వయంగా 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా సలాం జాడ కనిపించలేదు. దీంతో వారు వెళ్లిపోయారు. సలాం నందికొండవారిగూడెం శివారులోని తోట పక్కన పడి మృతి చెంది ఉండాన్ని స్థానికులు సోమవారం ఉదయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సలాం కొన్నేళ్లుగా అస్తమా, హెర్నియాతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుమారుడు సోఫియాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

ఫారెస్ట్ భూములు కాపాడాలని వినతి



కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేస్తున్న జీడయ్య యాదవ్

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని రాజగట్టు బ్లాక్ పరిధిలో ఫారెస్ట్ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో బీసీ సంఘం నాయకులు కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్‌లు మాట్లాడారు. దామరచర్ల మండలంలో ఫారెస్ట్ భూములను కొంతమంది కబ్జాదారులు రాత్రి వేళల్లో కబ్జా చేస్తున్నారని, ఈ కబ్జాకు సహకరిస్తున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీ-ఫామ్ పట్టా కలిగిన రైతులను వారి భూమిలో పంట వేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సైదానాయక్, రాజు, ప్రవీణ్, సువర్ణ పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్ ఇలా.. వెళ్లేదెలా!

- మూడు ఫీట్ల మేర నిలిచి క్యూరింగ్ నీరు
- వర్షం వస్తే పరిస్థితి ఎంటని ఆందోళనలో ప్రజలు

మిర్యాలగూడ అర్బన్ : అండర్‌పాస్ వద్దు.. ఫ్లైఓవర్ కావాలి అంటూ.. అండర్‌పాస్‌తో కలిగే నష్టాలను ముందుగానే గ్రహించి పలు మార్లు ఆందోళనలు చేసిన అక్కడి ప్రజల భయం నిజం అయ్యేలా ఉంది. మిర్యాలగూడ పట్టణం నుంచి చిల్లాపురం రోడ్డులో ఉన్న రైల్వే గేట్ వద్ద నిర్మించిన అండర్ పాస్‌తో ప్రజల కష్టాలు తొలుగుతాయనుకుంటే మరింతగా పెరుగుతున్నాయని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైల్వే గేట్ వద్ద తరుచూ రైళ్ల రాకపోకలు జరుగుతుండటంతో ఆ రోడ్డు గుండా ప్రయాణం సాగించే పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండే వారు. ఒక్కో సమయంలో అత్యవసరంగా ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులను త్వరితగతిన ఆస్పత్రులకు చేర్చాలంటే రైలు గేట్ పడితే 15నిమిషాల నుంచి ఒక్కోసారి 20నిమిషాలు వరకు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించాలని ఆ రోడ్డు గుండా ప్రయాణాలు సాగించే చిల్లాపురం, ఐలాపురం, అజ్మీరాతండా, గోపసంద్రంతండా, పెద్దదేవులపల్లి గ్రామాల ప్రజలు అనేక మార్లు రైల్వే ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నారు. దీంతో అక్కడి పరిస్థితులను గమనించేందుకు వచ్చిన రైల్వే అధికారులు ఫ్లైఓవర్ కాకుండా అండర్‌పాస్ నిర్మాణం వైపుకు మొగ్గు చూపారు. ఆ సమయంలో అండర్‌పాస్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన అక్కడి ప్రజలు అనేక సార్లు రైల్వే స్టేషన్ వద్ద ధర్నాలు సైతం నిర్వహించారు. ఆందోళన చేస్తున్న ప్రజలతో చర్చించిన రైల్వే అధికారులు అత్యంత సాంకేతికతను వినియోగించి వర్షపు నీరు నిల్వ కుండా ద్విచక్ర వాహనాలు, ఇతర వ్యవసాయాలకు వినియోగించే వాహనాలు సైతం అండర్ పాస్ నుంచి వెళ్లేలా వేర్వేరుగా రెండు అండర్‌పాస్‌లను నిర్మించి వర్షం నీరు నిల్వకుండా చూస్తామని వారికి హామీ ఇచ్చి అండర్ పాస్ నిర్మాణం చేపట్టారు. వారం రోజుల క్రితమే వినియోగంలోకి తెచ్చిన అండర్‌పాస్ నీరు నిల్వ ఉండి వాహనాలు వెళ్లలేని స్థితిలో ఉంది.



భారీ వాహనాలు వెళ్లేందుకు నిర్మించిన అండర్‌పాస్‌లో నిల్వ ఉన్న క్యూరింగ్ నీరు

నీరు వెళ్లేందుకు వీలుగా ఉన్న..

అండర్‌పాస్ నిర్మాణం చేపట్టిన రైల్వే అధికారులు రెండు వేర్వేరు అండర్ పాస్ లు నిర్మించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు సమాంతరంగా కాలువను తవ్వి గూణలు ఏర్పాటు చేసి ఆ నీరు ఓ బావిలోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. అంతా భాగానే ఉన్నా .. నిర్మాణ సమయంలో క్యూరింగ్ కోసం ప్రతి రోజూ పోస్తున్న నీరు ఆగుణ ద్వారా బావిలోకి వెళ్లడంతో ఆ బావి పూర్తిగా నిండిపోయింది. దీంతో మిగిలిన నీరు బయటకు పోయేందుకు అవకాశం లేకుండా అండర్‌పాస్‌లోనే నిల్వ ఉండటంతో ఇటీవల వినియోగంలోకి వచ్చిన అండర్‌పాస్‌లోనే మూడు ఫీట్ల మేర నీరు నిల్వ ఉండి వాహనాదారులకు ఇబ్బందిగా మారింది. కేవలం క్యూరింగ్ నీటికే అండర్‌పాస్‌లో మూడు ఫీట్ల మేర నీరు నిలిస్తే వర్షాలకు 10నుంచి 20 ఫీట్లకు తగ్గకుండా నీరు నిల్వ ఉంటుందని, ఆ నీటిలోకి వాహనాలు వెళ్తే వారి ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా ద్విచక్ర వాహనాదారులు వెళ్లే అండర్‌పాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయనందున వాహనాలు వేగంగా వచ్చి ఢీ కొట్టి ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి అండర్ పాస్‌లో నీరు నిల్వ ఉండకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు వీలుగా నిర్మించిన అండర్‌పాస్

వర్షం వస్తే ఇబ్బందే..



అండర్‌పాస్‌లో నిలిచిన నీటి వలన ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రాంతలో ఫ్లై ఓవర్ నిర్మించాలని వేడుకున్నా అధికారులు వినలేదు. కేవలం క్యూరింగ్ చేసిన నీరు నిలిస్తేనే ఇన్ని ఫీట్ల నీరు నిల్వ ఉంటే ఇక వర్షం వస్తే పరిస్థితి ఎమిటనే ఆలోచిస్తే భయమేస్తుంది. వర్షాకాలంలో నీరు నిలిచి రాత్రి సమయంలో ఎవరైనా వచ్చి అందులో మునిగితే ఎవరూ బాధ్యత వహిస్తారు. ఇప్పటికైనా రైల్వే అధికారుల్పు స్పందించి అండర్ పాస్‌లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి.

– రవినాయక్, మిర్యాలగూడ

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోయగూడెంలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎలాంటి షరతులు లేకుండా ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి. నిన్న అసెంబ్లీ సాక్షిగా వ్యవసాయ శాఖ మంత్రి రెండు లక్షల పైగా ఉన్న అప్పు రుణమాఫీకి వర్తించదని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. వానాకాలంలో రైతులు పండించిన పంటకు బోనస్ నేటికి సగం మందికి పైగా రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. అనుముల మండలంలోని వీర్లగడ్డ తండాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వీర్లగడ్డతండా తాజా మాజీ సర్పంచ్ సఫావత్ సంధ్యరాము నాయక్, పురుషోత్తం యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ బాలునాయక్, నాయకులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

ఎమ్మెల్సీగా ఎన్నికైన శంకర్‌నాయక్‌కు సన్మానం

మిర్యాలగూడ : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన శంకర్‌నాయక్ సోమవారం మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను కలిశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను స్వాగతం పలికి పుష్పగుచ్ఛం, సంత్ సేవాలాల్ చిత్రపటం, శాలువాతో ఘనంగా సన్మానించారు. వారితోపాటు డీఏఓ శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్లు హరిబాబు, జవహర్‌లాల్, పుష్పలత, సురేష్, ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఏఓ సైదానాయక్, ఆర్ఐ రామకృష్ణ, సత్యనారాయణ, ఎంఈఓలు బాలాజీనాయక్, బాలునాయక్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, దామరచర్ల కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, జామాల్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న సబ్ కలెక్టర్, సిబ్బంది

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో..

శంకర్‌నాయక్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను సన్మానించిన వారిలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, వేములపల్లి, దామరచర్ల కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మాలి కాంతారెడ్డి, శ్రీనివాస్, నాయకులు వినోద్, జనార్దన్ నాయక్, నెహ్రూనాయక్, లింగానాయక్, బాలునాయక్, కొమ్ము దాస్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికైన శంకర్‌నాయక్ సోమవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయాలనికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు ఎమ్మెల్సీగా ఎన్నికైన శంకర్‌నాయక్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఖాజాహామీదుద్దీన్, ఎండీ అస్లాం, జి. వెంకన్న, కలిమెల నాగయ్య, ఖాజానాజీమొద్దీన్, ఎండీ అయ్యూబ్, అశోక్, అవుల రమేష్, మంద సైదులు, పుప్పాల యాదగిరి, జి. మహేష్, రాజారాం తదితరులున్నారు.

పోడు భూముల రైతులకు రుణాలు ఇవ్వాలి



పెద్దఅడిశర్లపల్లి : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



హాలియా : మున్సిపాలిటీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి సైదులు

పెద్దఅడిశర్లపల్లి : పోడు భూములు సాగుచేస్తున్న రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పోడు భూముల రైతులకు రుణాలు ఇవ్వాలని కోరుతూ నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వెనుకబడిన గిరిజన తండాల్లో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, శంకర్, దేవయ్య, సత్యనారాయణ, మోతిలాల్, సాయిలు, రామస్వామి, వెంకటేశ్వర్లు, రెతులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

హాలియా : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అవుతా సైదులు ప్రభుత్వాన్ని డిమాడ్ చేశారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారిని అపర్ణకు వినతిపత్రం అందజేశారు. హాలియాలోని 48 సర్వే నంబర్‌లో ఉంటున్న పేదలకు తక్షణమే ఇంటి పట్టాలు మంజూరు చేసి రోడ్లు, డ్రైయినేజీ, కరెంట్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రేబెల్లి వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీను, అంజి, ఈదయ్య, లింగయ్య, వెంకటమ్మ, రజిత ఉన్నారు.

గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

వేములపల్లి : మండలంలోని బుగ్గబావిగూడెంలో డ్రైయినేజీ సమస్యను అధికారులు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం బుగ్గబావిగూడెంలో నిర్వహించిన ప్రజాపోరుబాట కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి రాంరెడ్డి, వడ్డెగాని సైదులు, భిక్షం, పద్మ, మాధవి, సుకన్య పాల్గొన్నారు.

త్రిపురారం : గ్రామాల్లో నెలకొని ఉన్న ప్రజా సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కరించాలని, లేదంటే ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ గాజుల ప్రమీలాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దైద శ్రీను, మండల నాయకులు కొప్పు వెంకన్న, గోగుల ఇద్దయ్య, భిక్షం, రెమిడాల రామచంద్రయ్య, కోటయ్య, హుస్సేనమ్మ, మదు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

గుర్రంపోడు : వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మహిళా రైతులకు 50శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి తెలిపారు. తైవాన్ స్ప్రేయర్లు, చేతి పంపులు, ట్రాక్టరు సంబంధిత పనిముట్లకు ఆసక్తి గల మహిళా రైతులు తమ దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుపుస్తకం జీరాక్స్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ జీరాక్స్ పాసుపోర్టు సైజు ఫోటోతో ఈ నెల 26న మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

అడవిదేవులపల్లి : వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2024-2025 కింద అడవిదేవులపల్లి మండలానికి చెందిన మహిళా రైతులకు 50శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ అధికారి గుర్రం సరిత తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకు అర్హులైన మహిళలందరూ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, పాస్‌పోర్టు సైట్ ఫొటో, ట్రాక్టర్ ఆసీ వంటి జీరాక్స్‌లను జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పన్ను చెల్లించకుంటే చర్యలు తప్పవు

దేవరకొండ : సకాలంలో ఆస్తి, నీటి పన్నులు చెల్లించకుంటే చర్యలు తప్పవని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. సోమవారం దేవరకొండ మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని చేనేత సహకార సంఘం భవనంలోని పలు దుకాణాలను అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సుదర్శన్ మాట్లాడుతూ చేనేత సహకార సంఘం భవనంలో దుకాణాలకు సంబంధించి రూ.2లక్షల 54వేలు పన్ను బకాయిలు ఉన్నాయని ఇందుకు సంబంధించి ఇప్పటికే నోటీసులు సైతం జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.పట్టణ ప్రజలు సకాలంలో మున్సిపాలిటీకి సంబంధించి పన్ను బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు. మున్సిపల్ అధికారులు విజయ్, రాకేశ్, నాగరాజు, రవి, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి జాతర



తిరుమలగిరి : బోయగూడెంలో గంగమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న జానారెడ్డి



త్రిపురారం : అల్వాలపాడు గంగమ్మ ఆలయంలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : యాదవుల ఆరాధ్యదైవం గంగమ్మతల్లి జారతను సోమవారం మండలంలోని బోయగూడెం, తెట్టకుంట గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు తమ సాంప్రదాయ దుస్తులను ధరించి కత్తులు, కటార్లతో ఓ లింగ... ఓ లింగా అంటూ ఆడిపాడారు. ఆదివారం అర్ధరాత్రి గంపలతో గ్రామ పురవీధుల గుండా అమ్మవారి ఆలయానికి చేరుకొని అమ్మవారికి సోమవారం ఉదయం భోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి గొర్రెపొటేళ్లను బలిచ్చారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జాతర నిర్వహిస్తుండటంతో రెండు గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్సీగా ఎన్నికైన శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ కోటిరెడ్డిలు గంగమ్మ తల్లి జాతరలో వేర్వేరుగా పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు, నాయకులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో..

నిడమనూరు : మండలంలోని వెంకటాపురం గ్రామంలో సోమవారం గంగమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. యాదవుల ఆరాధ్య దైవంగా గంగమ్మ తల్లికి ప్రతి ఏడాది ఉగాది ముందర జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. చెరువుపైన వెలిసిన గంగమ్మ తల్లులకు కి పెద్ద ఎత్తున భక్తులు బుట్టలో ఉన్న ప్రసాదాలు, సారె, నూతన వస్త్రాలు, బోనాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని అల్వాలపాడులో యాదవులు ఆరాధ్య దైవంగా కొలిచే గంగమ్మ దేవాలయంలో జాతర ఉత్సవాలను సోమవారం గ్రామస్తులు అంగరంగవైభవంగా నిర్వహించారు. యాదవ కులస్తులు ప్రత్యేకంగా నిర్వహించే ఈ జాతరలో ఆచార వ్యవహారాల ప్రకారం గంగమ్మ జాతరను జరుపుకున్నారు. ఆలయంలో ముందుగా గణపతి పూజ, పుణ్యావాచనం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ కొత్త కుండలో వండిన బోనాలతో ఆలయం వద్దకు వచ్చి గంగమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా త్రిపురారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు శ్రీనివాస్ రెడ్డి, బిట్టు రవి కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గుడిపాటి రాంబాబు, గుడిపాటి రవి కుమార్, రమావత్ సైదా, సైదులు, రాంబాబు పాల్గొన్నారు.

36ఏళ్ల తర్వాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు



పెద్దవూర : ఆత్మీయ సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెద్దవూర : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా 36 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి, సుజాత, యాదగిరి, విద్యార్థులు దామోదర్‌రెడ్డి, లింగయ్య, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, శంకర్, శ్రీనివాస్ రెడ్డి, రమాదేవి, రవీందర్‌రెడ్డి, మాధవి, సైదిరెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా అంజయ్య



నాగార్జునసాగర్ : ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డు అందుకుంటున్న అంజయ్య



కొండమల్లేపల్లి : ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకుంటున్న మండల వైద్యాధికారి ఉషారాణి

నాగార్జునసాగర్ : అంతర్జాతీయ టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ (సమీకృతసేవ, పరీక్ష కేంద్రం)సెంటర్‌లో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న మంగళగిరి అంజయ్య ఉత్తమ ల్యాబ్‌టెక్నీషియన్‌గా అవార్డు అందుకున్నారు. అంతర్జాయ టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, జిల్లా టీబీ నివారణ అధికారి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృష్ణకుమారి చేతులమీదుగా ఉత్తమ ఉద్యోగ సేవ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ వైద్యబృందం ఆయనను అభినందించారు.

వైద్యాధికారికి ఉత్తమ ప్రతిభా పురస్కారం

కొండమల్లేపల్లి : ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కొండమల్లేపల్లి మండల వైద్యాధికారి ఉషారాణి సోమవారం డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. మండల వైద్యాధికారిణికి పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

దేవరకొండ : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని దేవరకొండ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయిల్‌పై దాడికి పాల్పడి అతడికి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేవరకొండ కోర్టు బయట నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రమాశంకర్, ఇంద్రవరప్రసాద్, రాములు, ముస్తాక్ అహ్మద్, దుర్గ, రవి, కృష్ణ, రాజశేఖర్, శ్రీను, కిషన్, పాల్గొన్నారు.



దేవరకొండలో కోర్టు బయట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

విశ్వకర్మ కిట్లు అందజేత



శిక్షణ పొందిన వారికి కిట్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : స్థానిక ప్రధాన పోస్టాఫీసు వద్ద విశ్వకర్మ యోజన పథకం కింద శిక్షణ పూర్తి చేసుకున్న బంటు శివకు విశ్వకర్మ కిట్టును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు సోమవారం అందజేశారు. మిర్యాలగూడ అసెంబ్లీ పరిధిలో ఇప్పటి వరకు 371మంది విశ్వకర్మలకు కిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

అద్దె బకాయిలను వసూలు చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపాలిటీ దుకాణ సముదాయాల ఆస్తి పన్నులతో పాటు వాటి అద్దె బకాయిలను వసూలు చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూలు చేసేందుకు రోజుకు టార్గెట్ పెట్టుకొని ప్రైవేట్ నివాసాల ఆస్తి పన్ను కట్టాలని ప్రజలకు ఇబ్బందులు గురిచేస్తున్న ప్రభుత్వ అధికారులకు పట్టణ నడిబొడ్డున ఉన్న ఎన్టీఆర్ మున్సిపాలిటీ దుకాణాల అద్దె బకాయిలు కనిపించడం లేదా అన్ని ప్రశ్నించారు. ప్రస్తుతం బినామీల పేరుతో ఉన్న పాత దుకాణాలను అన్నింటినీ తిరిగి వేలం నిర్వహించి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు పోతుగంటి కాశి, శ్రీనివాస్, రాజేష్ తదితరులు ఉన్నారు.

మూత్యలమ్మ ఆలయంలో పూజలు

చింతపల్లి : మండలం పరిధిలోని కుర్మేడు గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ తల్లి బ్రహ్మోత్సవాల వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్వేత పాల్గొన్నారు. అలాగే హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ గట్టుపత్తి మైసమ్మ జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా కొనసాగాయి. ఈ ఉత్సవాల సందర్భంగా వనవాసం, బండ్ల ఊరేగింపు ఘనంగా కొనసాగాగ ఈ ఉత్సవాలను తిలకించేందుకు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.